క్లుప్తంగా...

ఇందిరానెహ్రూనగర్ అభివృద్ధికి కృషి



ఇందిరానెహ్రూనగర్‌లో మెట్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మేకల సునీతయాదవ్

గౌతంనగర్: గ్రేటర్‌లోనే అతిపెద్ద మురికివాడ ఇందిరానెహ్రూనగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ మేకల సునీతయాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌లో చేపట్టిన మెట్ల నిర్మాణ పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరి కుంటలో అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఈఈ నాగేందర్, బన్నాల ప్రవీణ్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని కుమ్మరికుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉప్పల్ సర్కిల్ ఈఈ నాగేందర్‌తో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ నివారం పరిశీలించారు. చిలుకానగర్ పోచమ్మ ఆలయం నుంచి ఎస్సీ కమ్యూనిటీ హాల్ వరకు సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. కల్వర్టు క్రాసింగ్‌లలో పెద్ద పైపులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.పనుల్లో జాప్యం జరుగకుండా ప్రజలకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ నిఖిల్ రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, నాయకులు కొండల్ రెడ్డి, జగన్, పోచయ్య, యాదగిరి, బాలెందర్ తదితరులు పాల్గొన్నారు.

బండ చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోండి



బండచెరువును పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్

మల్కాజిగిరి: బండ చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అధికారులకు సూచించారు. శనివారం ఇరిగేషన్ డీఈ వెంకట రమణ, ఏఈ శివారెడ్డి, హెచ్‌ఎండీఏ డీఈ పవన్‌లతో కలిసి చెరువును పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ చెరువులో గుర్రపు డెక్క పెరిగిపోవడంతో దోమల బెడద తీవ్రంగా మారిందని, నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. బండచెరువు డీసిల్టింగ్ చేయడానికి డైవర్షన్ పనులు చేపట్టాలని సూచించామన్నారు. కార్యక్రమంలో స్వామి,బాబు, సత్యానారాయణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లో ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలకు మల్లారెడ్డి ట్రస్ట్ అండగా నిలిచింది. గ్రామానికి చెందిన కాళిదాసు, చరణ్, బాలుగౌడ్, శ్రీహరి కుటుంబ సభ్యులను శనివారం ఉప సర్పంచ్ లింగేశ్వర్ రావు, టీఆర్‌ఎస్ స్థానిక శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శంకర్, చిరంజీవి పరామర్శించారు. ట్రస్ట్ తరఫున బాధిత కుటుంబాలకు రూ. 5వేల చొప్పున రూ. 20 వేలు అందజేశారు. కార్యక్రమంలో మహేశ్‌ముదిరాజ్, సురేశ్, నరసింహా, బాలకృష్ణ, అరవింద్‌రెడ్డి, ట్రస్ట్ ప్రతినిధి వేణు పాల్గొన్నారు.

గుప్పు..గుప్పుమంటున్న గంజాయి

- డివిజన్ పరిధిలో జోరుగా గంజాయి దందా
- బానిసలుగా మారుతున్న యువత
- పార్కులు, చెట్ల పొదలే కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు



చిన్న చెరువు వాకింగ్ ట్రాక్‌పై గంజాయి సేవిస్తున్న యువత

రామంతాపూర్ : డివిజన్‌పరిధిలో గంజాయి దందా కొందరికి చక్కని ఆదాయవనరుగా మారి కాసులు కురిపిస్తోంది. కొందరు యువకు ఫ్యాషన్‌గా గంజాయిని అలవాటు చేసుకుని దానికి బానిసలుగా మారి మత్తులో మునిగి తేలుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. డివిజన్ పరిధిలోని చిన్న చెరువు వాకింగ్ ట్రాక్, రాజేంద్రనగర్ హిందూ శ్మశాన వాటిక ప్రహరీ వద్ద, రాంరెడ్డినగర్ నుంచి హెచ్‌ఎండీఏ లే ఔట్ వరకు బైపాస్ రోడ్డులోని బృందావన్ పార్కు, మూసీ పరివాహక ప్రాంతాలైన కేసీఆర్‌నగర్‌లోని బఫర్ జోన్ ప్రాంతంతో పాటు ఉప్పల్ పారిశ్రామికవాడలోని జెర్సీ ప్రాంతం గంజాయి విక్రయాలు, సేవించడానికి కేంద్రాలుగా మారాయి. స్థానిక శ్రీనివాసపురంలోని పాత అపార్టుమెంట్‌లో గత ఏడాది కొందరు వ్యక్తులు గంజాయి మొక్కలను పెంచిన సంఘటనలు ఉన్నాయి. గంజాయి మత్తులో పరస్పర దాడులకు పాల్పడటం వీధుల్లో వీరంగం సృష్టించడం నిత్యకృత్యమయ్యాయి. గత ఏడాది బైపాస్ రోడ్డులోని హ్యాపీ బార్ వద్ద వైట్నర్ సేవించిన కొందరు యువకులు గ్యాంగ్‌లుగా ఏర్పడి దాడులకు పాల్పడటంతో స్థానికులు భయభ్రాంతులకు గురి అయ్యారు. రామంతాపూర్ చిన్న చెరువు వాకింగ్ ట్రాక్ ప్రాంతంలో రాత్రి కాగానే యువత గుంపులు గుంపులుగా చేరి గంజాయి సేవిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత చిన్న చెరువు అనుకుని ఉన్న రాజేంద్రనగర్ శ్మశాన వాటిక ప్రహరీ వద్ద గంజాయి దందా జోరుగా జరుగుతోందని వారు పేర్కొన్నారు. పోలీసులు తరచూ పెట్రోలింగ్ నిర్వహించి గంజాయి దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కొందరు యువకులు మధ్యాహ్నం రామంతాపూర్ చిన్న చెరువు వాకింగ్ ట్రాక్‌పై గంజాయి సేవిస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు వారిని అక్కడి నుంచి పంపించారు.

అవగాహన శిబిరాలు నిర్వహించాలి



గంజాయి తాగడం వల్ల ఎదరయ్యే పరిణామాలపై స్థానిక యువతకు సంబంధిత అధికారులు, పోలీసులు అవగాహన శిబిరాలు నిర్వహించాలి. తమ పిల్లలు గంజాయికి అలవాటు పడుతుంటంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గంజాయి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

-నాసు సతీష్, ఆర్టీసీ కాలనీ, రామంతాపూర్

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా 16, 25, 26 డివిజన్లలో కొనసాగుతున్న పనులను శనివారం మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, పప్పుల రాజేశ్వరి అంజిరెడి, బండి రమ్య సతీష్ గౌడ్ పరిశీలించారు. పలు కాలనీల్లో పేరుకు పోయిన చెత్త చెదారాన్ని మున్సిపల్ సిబ్బందితో తొలగించారు. నాలాల్లో పేరుకు పోయిన పూడికను తొలగించాలని, ఇంటింటి నుంచి ప్రతిరోజు చెత్తను క్రమం తప్పకుండా సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి తొట్లను పరిశీలించి ఎప్పటికప్పుడు తొట్లలో నీటిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నగర పరిధిలో స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సేకరణ కేంద్రాన్ని సందర్శించి ప్రజల నుంచి సేకరించిన వస్తువుల వివరాలు పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకి, నాయకులు పప్పుల అంజి రెడ్డి, బండి సతీష్ గౌడ్ మల్లం వెంకటేష్ గౌడ్, సీనియర్ అసిస్టెంట్ జగన్ మోహన్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ ఆశయసాధనకు కృషి చేయాలి



నెహ్రూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సోమశేఖర్‌రెడ్డి

మల్లాపూర్: మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఉప్పల్ బి బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం జవహర్‌లాల్ నెహ్రూ 59వ వర్ధంతి సందర్భంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మొసలి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నెల్లుట్ల శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు రాఘవరెడ్డి, స్టార్‌రెడ్డి, జమీలభేగం, నవీన్‌గౌడ్, పొన్నాల రాజు. గౌస్ పాషా, రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా దశాబ్ది ఉత్సవాలు

- సన్నాహక సమావేశంలో మంత్రి మల్లారెడ్డి
- హాజరైన ఎమ్మెల్యేలు, కలెక్టర్

సాక్షి,మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను మేడ్చల్ జిల్లాలో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. 21 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అమయ్ కుమార్, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కె.పి.వివేకానందగౌడ్,భేతి సుభాష్‌రెడ్డితో కలిసి దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పదేళ్ళలోకి అడుగుపెడుతున్న శుభతరుణంలో ఈ ఉత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు వివిధ శాఖలు తమకు కేటాయించిన తేదీల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఇప్పటి నుంచే సన్నాహాలు చేపట్టాలన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు సమాయాత్తం

దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, శాఖల వారీగా సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై అప్రమత్తం చేశామన్నారు. వేడుకల ప్రారంభోత్సవం రోజు నుంచి పూర్తయ్యే వరకు తానే స్వయంగా పర్యవేక్షిస్తానని కలెక్టర్ అమయ్ కుమార్ పేర్కొన్నారు. జూన్ 2 నుంచి 21 రోజుల వరకు నిర్వహించే తెలంగాణ దశాబ్ది వేడుకలకు సంబంధించి రోజు వారీ కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నందారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, మేయర్లు జక్క వెంకట్‌రెడ్డి, మేకల కావ్య, బుచ్చిరెడ్డి, చైర్మన్లు కొండల్‌రెడ్డి, చంద్రారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు ఏనుగు నర్సింహారెడ్డి, అభిషేక్, డీఆర్‌ఓ లింగ్యానాయక్ ,ఆర్డీఓలు రవి, మల్లయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, మేయర్లు, చైర్మన్లు, డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్లు, మున్సిపల్ కమిషనర్లు, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు నమ్మి మోసపోవద్దు



మీసేవా సెంటర్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

అల్వాల్: రూ. 10వేలు చెల్లిస్తే 60 గజాల స్థలం ఇప్పిస్తామని కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారి చేతుల్లో పడి మోసపోవద్దని మల్కాజిగిరి మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. మౌలాలి డివిజన్ పరిధిలోని కాంత్రి మీ సేవా సెంటర్ వద్ద కొందరు దళారులు రూ. 10వేల చెల్లిస్తే ఘట్కేసర్ మండలం, కాచవాని సింగారం గ్రామంలో 60 గజాల స్థలం ఇప్పిస్తామని మీ సేవలో 58 జీఓ కింద దరఖాస్తు చేయిస్తున్నారని కొందరు వ్యక్తులు శనివారం మల్కాజిగిరి తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. కొందరు దళారులు ప్రజలను మోసం చేసేందుకు ఇలాంటి ప్రచారాలు చేస్తుంటారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కృషి అభినందనీయం

గౌతంనగర్: బ్రాహ్మణుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషి అభినందనీయమని బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షులు రఘుకిరణాచార్యులు అన్నారు. శనివారం గౌతంనగర్ డివిజన్, జ్యోతినగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లిలో రూ.12 కోట్లతో నిర్మించిన బ్రాహ్మణ భవనాన్ని ఈ నెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు, బ్రాహ్మణులందరికీ విద్య, ఉద్యోగ వ్యాపార అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. పలు జిల్లాల్లోనూ బ్రాహ్మణ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించినట్లు తెలిపారు. బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలను అందజేయడంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ రమణాచారి కృషి ఎంతో ఉందన్నారు.

యువకుడి అదృశ్యం



మహేందర్ (ఫైల్)

ఉప్పల్: ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విజయపురి కాలనికి చెందిన కప్పర బ్రహ్మయ్య కుమారుడు మహేందర్ బైక్ మెకానిక్‌గా పని చేసేవాడు. ఈ నెల 26న ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతను తిరిగి రాలేదు. అతడి కోసం గాలించిచా ప్రయోజనం కనిపించలేదు. మహేందర్ తండ్రి బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు.

మహిళ ఆత్మహత్య

ఉప్పల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ భరత్‌నగర్‌కు చెందిన తాప మహేందర్ భారతి(30) ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భారతి శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని గాంధీ అసుపత్రికి తరలించారు. భారతి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో శనివారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను చైర్ పర్సన్ పావనీ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపుల, ఇళ్ల మధ్య చెత్త చెదారం, వ్యర్థాలను శుభ్రం చేయించారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ వర్షాకాలం రానున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా వారం రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుంతల్లో నీరు నిలువకుండా పూడ్చివేయాలని, మార్కెట్లు, బస్సు ప్రయాణ ప్రాంగణాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కౌన్సిలర్ రవీందర్, జంగయ్యయాదవ్, విజయ్‌ముదిరాజ్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

30న మండల సర్వసభ్యసమావేశం

మేడ్చల్: ఈనెల 30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ వీర్లపల్లి రజిత రాజమల్లారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి అధికారులు, సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

డివిజన్ల సమగ్రాభివృద్ధే ధ్యేయం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ డివిజన్ పరిధిలో రూ. 1.42 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్లు, పార్కు పునరుద్ధరణ పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అన్నపూర్ణ కాలనీలో రూ.21 లక్షలతో సీసీ రోడ్డు, కేఎల్‌రెడ్డినగర్‌లో రూ.35.80 లక్షలు, ఎస్వీనగర్‌లో రూ. 24.70 లక్షలతో సీసీ రోడ్డు, వెంకటరమణ కాలనీలో రూ.13.20 లక్షలతో పార్కు పునరుద్ధరణ పనులు, బ్యాంక్ కాలనీలో రూ.8 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు. అశోక్ నగర్‌లో 39.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్ మాట్లాడుతూ మల్లాపూర్‌లో అన్ని కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కాప్రా డీసీ శంకర్, డీఈ రూప. ఏఈ స్రవంతి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు పల్లా కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుదేవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ



సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

కీసర: గీత కార్మిక కుటుంబంలో పుట్టి 16వ శతాబ్దంలో దొరలు, జాగిర్దార్లు, మొగలు సైన్యానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని కరీంగూడ గ్రామంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం రాత్రి కరీంగూడ గ్రామంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దేశం రవీందర్‌గౌడ్, దేశం అంజయ్యగౌడ్, దేశం మల్లేష్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, దేశం వెంకటేష్‌గౌడ్, దేశం శ్రీకాంత్‌గౌడ్, , సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పంజాలసరితా, గోక కళావతి, తదితరులు పాల్గొన్నారు.

బస్టాప్‌లోనే బస్సులు ఆపాలి

డ్రైవర్లకు గులాబీలు అందజేసి వినూత్న నిరసన



డ్రైవర్‌కు గులాబీ అందజేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: బస్టాప్‌లోనే బస్సులు ఆపాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఈ మేరకు శనివారం బస్సు డ్రైవర్లకు గులాబీ పూలు అందజేసి వినూత్నంగా నిరసన తెలిపారు. మల్కాజిగిరి చౌరస్తా నుంచి మీర్జాలగూడ వెళ్లే మార్గంలో ఇటీవల నాలా నిర్మాణ పనులు జరిగాయి. ఈ నేపథ్యంలో అభిరుచి హోటల్ మీదుగా బస్సులు వెళ్లకుండా తాత్కాలికంగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. పనులు పూర్తయిన బస్టాప్‌లో బస్సులు ఆపకుండా వన్‌వేలో వెళుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కుషాయిగూడ డిపో మేనేజర్, ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బస్సు డ్రైవర్లైనా బస్సులు ఆపాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశామన్నారు. కార్యక్రమంలో సునీల్, శ్రీకాంత్, వేణు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హిమగిరి కూచిపూడి నృత్య అకాడమీ విద్యార్థుల విభావరి ఆకట్టుకుంది. సూర్యప్రకాశ్ శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చల్లగాలి వెంకట రాజు కళాకారులను సత్కరించారు.



అభివృద్ధి పనులు ప్రారంభం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. డివిజన్ పరిధిలోని బొల్లారం, మహాత్మాగాంధీనగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నేరవేరుస్తామన్నారు. డివిజన్‌లో ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకరావాలన్నారు. మచ్చబొల్లారం డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో డీఈ. మహేష్, జలమండలి అధికారి సాంబయ్య, పారిశుద్ధ్య కార్మికుల అధికారి ప్రభాకర్, స్థానిక నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, శ్రావణ్ ముదిరాజ్, రాజేందర్ యాదవ్, వివిరావు, పరమేష్, శ్రీనివాస్‌గౌడ్, శోభన్, శకుంతల నాయుడు, కాలనీ వాసులు నరహరి, నరేందర్‌సింగ్, వెంకటేష్, వీరేందర్‌రావు, లక్ష్మమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్